క్లుప్తంగా

విగ్రహ నిర్మాణ దాతలకు కృతజ్ఞతలు

పాకాల: నూతనంగా ఆవిష్కరించిన 54 అడుగుల సుబ్రమణ్యస్వామి విగ్రహానికి సహకరించిన విరాళ దాతలకు ఆలయ కమిటీ చైర్మన్ మహాసముద్రం పట్టాభిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ స్థానిక పాళ్యం కొండపై వెలసిన శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయ ఆవరణలో నిర్మించిన విగ్రహానికి దాతల నుంచి మొత్తం రూ.40,61,352 వచ్చిందని తెలిపారు. విగ్రహ నిర్మాణానికి రూ.39,49,600 ఖర్చు అయిందని పేర్కొన్నారు. మిగిలిన రూ.1,11,752తో సుబ్రమణ్యస్వామి విగ్రహం చుట్టూ స్టీల్ గ్రిల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. దాతలందరికీ సుబ్రమణ్యస్వామి ఆశీస్సులు కలగాలని ఆ దేవుణ్ణి ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

కాపు సంఘం ఉపాధ్యక్షుడిగా ఆర్కాట్ కృష్ణప్రసాద్

తిరుపతి కల్చరల్: తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ కాపు సంఘం ఉపాధ్యక్షుడిగా తిరుపతికి చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర నేత ఆర్కాట్ కృష్ణప్రసాద్‌ను నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆకుల వెంకట రమణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. 2019లో కాపు సంఘంలో సభ్యునికి చేరిన ఇతను రెండు తెలుగు రాష్ట్రాల్లో కాపు, బలిజ కులాల అభ్యున్నతికి చేస్తున్న సేవలను గుర్తించి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించినట్లు పేర్కొన్నారు. తనకు హైదరాబాద్ కాపు సంఘం ఉపాధ్యక్ష పదవి కల్పించిన సంఘ రాష్ట్ర నేతలకు ఈ సందర్భంగా ఆర్కాట్ కృష్ణప్రసాద్ కృతజ్ఞతలు తెలియజేశారు.

దూదేకుల నాయకులకు అభినందనలు


రహీం


అల్తాఫ్

పాకాల: మండలంలోని దామలచెరువు పంచాయతీకి చెందిన రహీం, అల్తాఫ్‌కు పలువురు ముస్లింలు అభినందనలు తెలిపారు. ఆదివారం దూదేకుల సంఘం తూర్పు రాయలసీమ కో–ఆర్డినేటర్‌గా రహీం, చంద్రగిరి నియోజకవర్గం అధ్యక్షుడిగా అల్తాఫ్‌లు ఎన్నికయ్యారని, దూదేకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎస్ బాజీ సూచనల మేరకు వీరిని నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు పీరా తెలిపారు. మండలంలోని పలువురు ముస్లిం నాయకులు వీరి ఎంపికపై హర్షం వ్యక్తం చేశారు. నూతనంగా పదవులకు ఎంపికైన రహీం, అల్తాఫ్ మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు.

బస్టాండ్‌లో ట్రాఫిక్ సమస్యలు

తిరుపతి అర్బన్: తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లో ట్రాఫిక్ సమస్యలు తప్పడం లేదు. ఆర్టీసీ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపకపోవడంతోనే సమస్యలు వస్తున్నాయని పలువురు విమర్శలు చేస్తున్నారు. బస్టాండ్‌కు రోజూ వందల సంఖ్యలో బస్సులు వచ్చిపోతుంటాయి. రోజుకు 1.50 లక్షల మంది ప్రయాణికులు బస్టాండ్ ఆధారంగా రాకపోకలు సాగిస్తున్నారు.ఈ క్రమంలో ట్రాఫిక్‌ను నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వచ్చిపోయే బస్సులతో ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలి. అయితే ఆ దిశగా అధికారులు దృష్టి సారించడం లేదు. దీంతో దీర్ఘకాలంగా ట్రాఫిక్ సమస్యతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో ట్రాఫిక్ నేపథ్యంలో బస్సు బస్టాండ్‌లో నుంచి ప్రయాణికులతో బయటకు వెళ్లడానికి 30 నుంచి 40 నిమిషాల సమయం పడుతుంది. అయితే ఇటీవల శ్రీనివాస సేతును అందుబాటులోకి తీసుకువచ్చినప్పటికి బస్టాండ్‌లో పటిష్టమైన చర్యలు చేపట్టకపోవడంతో ఇక్కట్లు ఎదురుక్కొంటున్నారు. ఈ విషయంపై అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామచంద్రనాయుడును వివరణ కోరగా లోటుపాట్లు ఉంటే సవరిస్తామని...ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతామని తెలిపారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో ముత్యాలమ్మ


చిల్లకూరు: తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం పలు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు అమ్మవారికి పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. మహిళలు సంతానం కోసం ఆలయంలోని రావి చెట్టు, త్రిశూలం వద్ద వరపడ్డారు. ఊయల కట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ట్రస్టు చైర్‌పర్సన్ సిద్దారెడ్డి ఇంద్రసేనమ్మ, ఆలయ ఈఓ నవీన్‌కుమార్ పర్యవేక్షించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

మకరందం... ఆనందం



తిరుపతి శేషాచలం అడవులు అనేక రకాల పక్షులు, అరుదైన వృక్షజాతులకు ఆలవాలం. ఆదివారం తెల్లవారుజామున కురిసిన చిరు జల్లులకు శేషాచలం కొత్తరూపు సంతరించుకుంది. అడవుల్లోని మొక్కలు, పుష్పాలు ప్రకృతి అందాలను ప్రదర్శించాయి. ఈ ఆహ్లాద వాతావరణంలో దక్షిణాసియాకు మాత్రమే సొంతమైన పర్పుల్ సన్‌బర్డ్ పువ్వుల్లోని మకరందం సేవనానికి పూనుకొంది. ఈ పిట్ట వినసొంపైన శబ్దాలు చేస్తూ నీటి బిందువులతో నిండిన ఎల్లోబెల్స్ పువ్వుల్లోని మకరందాన్ని, తన ముక్కుతో ఆస్వాదిస్తున్న దృశ్యాలను 'సాక్షి' కెమెరా బంధించింది.





పారిశుధ్యమే పరమావధి

- మంగళం సప్తగిరికాలనీ గ్రామ పంచాయతీలో ప్రత్యేక పారిశుధ్య పనులు
- ఎప్పటికప్పుడు చెత్త సేకరణ, కాలువలు శుభ్రపరచడంలో చొరవ
- దోమల నివారణకు చర్యలు


ఇంటింటికి వెళ్లి చెత్త సేకరిస్తున్న పంచాయతీ సిబ్బంది

తిరుపతి మంగళం: మంగళం సప్తగిరికాలనీ గ్రామ పంచాయతీలోని ప్రజల ఆరోగ్యమే ముఖ్యంగా ఆ పంచాయతీ ఉపసర్పంచ్ అశోక్‌రెడ్డి, పంచాయతీ అధికారులు ప్రత్యేక పారిశుధ్య పనులు చేయిస్తున్నారు. సప్తగిరి కాలనీ గ్రామ పంచాయతీలో వెంకటేశ్వరకాలనీ, సప్తగిరి కాలనీ, అంబేద్కర్‌కాలనీ, బీటీఆర్‌కాలనీ తదితర ప్రాంతాల్లో పారిశుధ్యం, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇటీవల కురిసిన వర్షాలు, వాతావరణంలో మార్పులు కారణంగా విషజ్వరాలు ప్రబలుతున్నాయి. ఈ నేపథ్యంలో సప్తగిరికాలనీ గ్రామ పంచాయతీలో అలాంటి పరిస్థితి తలెత్తకుండా ఎప్పటికప్పుడు చెత్త సేకరణ, మురుగుకాలువలు శుభ్ర పరచడంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు.

ఇంటింటి నుంచి చెత్త సేకరణ

పంచాయతీలోని ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ, మురుగు కాలువలు శుభ్రపరచడం వంటివి చేస్తున్నారు. గతంలో ఎక్కడ చూసినా రోడ్లపై గుట్టలు గుట్టలుగా చెత్త పడి ఉండేది. దీంతో స్థానిక ప్రజలతోపాటు అటు మార్గంలో వెళ్లే వారు రోగాల బారిన పడేవారు. అయితే ఇప్పుడే ఆ పరిస్థితి లేదు. ఎప్పటికప్పుడు చెత్త సేకరణ జరుగుతుండడంతో పంచాయతీలోని రోడ్లు ఎంతో పరిశుభ్రంగా కనిపిస్తున్నాయి. కోట్లాది రూపాయల నిధులతో ఎక్కడా మురుగు రోడ్లపైకి రాకుండా పెద్ద కాలువలు సైతం నిర్మించారు.

దోమల నివారణే లక్ష్యంగా...

పారిశుధ్య పరిశుభ్రతతోపాటు దోమల నివారణే లక్ష్యంగా తగు చర్యలు చేపట్టారు. నిత్యం కాలనీల్లోని మురుగు కాలువల్లో దోమలు నిల్వ ఉండకుండా మలాథియాన్ మందు చల్లుతున్నారు. దీంతో పాటు రాత్రి సమయంలో దోమలు విజృంభించకుండా ఫాగింగ్ చేస్తున్నారు. ఇలా నిత్యం దోమల నివారణకు పంచాయతీ అధికారులు కృషి చేస్తున్నారు.

నిత్యం పర్యవేక్షిస్తున్నాం...

చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, 2024 ఎమ్మెల్యే అభ్యర్థి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సూచనల మేరకు మంగళం సప్తగిరికాలనీ గ్రామ పంచాయతీలోని ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా సేవలందిస్తున్నాం. ముఖ్యంగా పంచాయతీలో పారిశుధ్య పరిశుభ్రత కోసం అహర్నిశలు శ్రమిస్తున్నాం. పంచాయతీలోని కాలనీల్లో ఎప్పటికప్పుడు చెత్త సేకరణ, మురుగు కాలువలు శుభ్రం చేయించడంతోపాటు దోమల నివారణకు మలాథియాన్ చల్లించడం, ఫాగింగ్ చేయించడం తదితర చర్యలు చేపడుతున్నాం. వీటిని క్రమం తప్పకుండా పంచాయతీలో అమలు అయ్యేలా నిత్యం పర్యవేక్షిస్తున్నాం. – అశోక్‌రెడ్డి, ఉపసర్పంచ్, సప్తగిరికాలనీ


మలాథియాన్ చల్లిస్తున్న ఉపసర్పంచ్ అశోక్ రెడ్డి, పంచాయతీ అధ్యక్షుడు మహ్మద్‌కాసీమ్


దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్న పంచాయతీ సిబ్బంది


సప్తగిరి కాలనీ వీధుల్లో నిండుకున్న దోమల నివారణ పొగ

వారపు సంతలో అన్నదానం


అన్నదానం చేస్తున్న వైఎస్ఆర్ సీపీ నాయకులు

చంద్రగిరి: వారపు సంతలో వ్యాపారాలు చేసుకునే రైతన్నలకు, వ్యాపారుకు తుడా చైర్మన్, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆదివారం ఆ పార్టీ నాయకులు నిర్వహించారు. మధ్యాహ్నం 12.30గంటల నుంచి 4 గంటల వరకు సుమారు 500 మందికి అన్నదానం చేసినట్లు పార్టీ డివిజన్ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ సుమారు నాలుగు నెలలుగా ప్రతి అదివారం సంతలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దూర ప్రాంతాల నుంచి వ్యాపారాలు చేసుకునే వర్తకులు, రైతులకు మధ్యాహ్నం ఆకలితో పస్తులుండకూడదనే ఉద్దేశంతో తమ నాయకులు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సంకల్పించారన్నారు. ఇందులో భాగంగా ప్రతి ఆదివారం రుచికరమైన ఆహారాన్ని అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బుల్లెట్ చంద్రమౌళిరెడ్డి రెడ్డి, నాయకులు కొత్తపాటి కోటి, విరుపాక్షి శంకర్ రెడ్డి, సిద్దిక్ ఖాన్ ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో మేధోశక్తిని వెలికితీయాలి


క్విజ్ పోటీలను పర్యవేక్షిస్తున్న స్మార్ట్ సిటీ ఎండీ డి.హరిత

తిరుపతి తుడా: విద్యార్థుల్లో దాగి ఉన్న మేధో శక్తిని వెలికి తీసేందుకు తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు ప్రయత్నించాలని తిరుపతి స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్ డి.హరిత పేర్కొన్నారు. ఇందుకు క్విజ్‌లు, కాంపిటీటివ్ పోటీలు కీలకంగా దోహదపడతాయని ఆమె అన్నారు. తిరుపతి తుడా సర్కిల్ వద్దనున్న మున్సిపల్ కార్పొరేషన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా హరిత మాట్లాడుతూ తిరుపతి స్మార్ట్ సిటీ, తిరుపతి నగరపాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నవంబర్ 14న చిల్డ్రన్స్‌డేను పురస్కరించుకుని ఇంటర్ స్కూల్స్ క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 110 స్కూళ్ల నుండి మొత్తం 440 మంది విద్యార్థినీవిద్యార్థులు క్విజ్ కాంపిటీషన్లో పాల్గొన్నారన్నారు. మాస్టర్ మైండ్స్ వారి నిర్వహణలో 110 టీములకుగాను 8 టీములను ప్రతిభ ఆధారంగా సెలెక్ట్ చేయనున్నామన్నారు. నవంబర్ 14వ తేదీ తిరుపతి కచ్చపి ఆడిటోరియంలో ఎంపికైన 8 టీములకు ఫైనల్ రౌండ్ క్విజ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆరోజు మొదటి స్థానం సాధించిన టీమ్ కు ఒక లక్ష, రెండో టీంకు రూ.50 వేలు, మూడో స్థానంలో నిలిచిన టీమ్‌కు రూ.25 వేల బహుమతులు ఇస్తామని పేర్కొన్నారు. స్మార్ట్ సిటీ జీఎం చంద్రమౌళి, మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, సూపరింటెండెంట్ పి.రవి, ఈవెంట్ మేనేజర్ కిషన్, విద్యాసాగర్ రెడ్డి, శశి, గిరి తదితరులు పర్యవేక్షించారు.

అభ్యంతరాల పరిష్కారానికి చర్యలు

నియోజకవర్గ ఓటరు ముసాయిదా జాబితాలో మార్పు, చేర్పులకు రెండు రోజులపాటు పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక శిబిరాలను నిర్వహించినట్లు నియోజకవర్గ ఓటర్ నమోదు అధికారి తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.హరిత తెలిపారు. జాతీయ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తిరుపతిలో శని, ఆదివారాల్లో ఓటరు ముసాయిదా జాబితాలో మార్పు చేర్పులకు అవకాశం కల్పించింది. కమిషనర్ హరిత ఈ ప్రత్యేక శిబిరాలను ఆదివారం అర్బన్ తహసీల్దార్ వెంకటరమణ, ఇతర ఎన్నికల అధికారులతో కలిసి తనిఖీ చేశారు . ఎన్నికల విధులపై సిబ్బంది అప్రమత్తంగా, కచ్చితత్వంతో పని చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీల్లో సూపర్వైజర్లు బిఎల్వోలు పాల్గొన్నారు.

ప్రజా సంకల్ప యాత్రకు ఆరేళ్లు

- నేడు తుడా సర్కిల్ వద్ద వైఎస్ఆర్ విగ్రహానికి నివాళులు
- పార్టీ నగర అధ్యక్షులు పాలగిరి ప్రతాప్‌రెడ్డి

తిరుపతి మంగళం: రాష్ట్ర ప్రజలకు సంక్షేమ ఫలాలను అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు జననేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర సోమవారానికి ఆరేళ్లు పూర్తి చేసుకోనుంది. ఈ నేపథ్యంలో తిరుపతి తుడా సర్కిల్ వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించి, భారీ కేక్ కట్ చేయనున్నట్లు వైఎస్ఆర్ సీపీ నగర అధ్యక్షుడు పాలగిరి ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, తిరుపతి కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్‌రెడ్డి, ముద్ర నారాయణ పాల్గొంటారని తెలిపారు. అదే విధంగా కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు, వివిధ సంస్థల చైర్మన్లు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

రైతు ఉత్పత్తి సంస్థ సేవలు వినియోగించుకోండి


కార్యక్రమంలో మాట్లాడుతున్న సంస్థ కార్యదర్శి రజని

రామచంద్రాపురం: మండలంలోని కుప్పంబాదూరులో నారీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతు ఉత్పత్తి సంస్థ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ కార్యదర్శి రజని అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు ఉత్పత్తి సంస్థ ద్వారా రైతులకు నాణ్యమైన వరి, వేరుశనగ విత్తనాలను అందిస్తున్నట్లు తెలిపారు. విత్తనాలను నిల్వ చేయడానికి కలెక్షన్ సెంటర్ ఉన్నట్లు చెప్పారు. త్వరలో సీరామాపురంలో మరొక కలెక్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో నారీ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

అన్నపూర్ణాదేవికి ప్రత్యేక పూజలు

బుచ్చినాయుడుకండ్రిగ: ఉగ్గుమూడి గ్రామంలో నిర్మించిన శివాలయంలో వెలసిన అన్నపూర్ణాదేవికి ఆదివారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన


ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ సుబ్బారావు

తిరుపతి కల్చరల్: డీబీఆర్ రోడ్డు, నారాయణ కళాశాల వెనుకనున్న ఎస్వీ అలెర్జీ అండ్ చెస్ట్ హాస్పిటల్‌లో ఆదివారం నిర్వహించిన శ్వాసకోశ వ్యాధుల ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగిన ఈ ఉచిత వైద్య శిబిరానికి 300 మందికి పైగా ప్రజలు పాల్గొని వైద్య సేవలు పొందారు. ఈ సందర్భంగా ఎస్వీ అలెర్జీ అండ్ చెస్ట్ హాస్పిటల్ అధినేత ప్రముఖ శ్వాసకోశ వ్యాధుల నిపుణుడు డాక్టర్ ఎస్.సుబ్బారావు ఆధ్వర్యంలో ఉచితంగా కంప్యూటరైజ్డ్ పీటీఎఫ్, ఎక్స్‌రే, ఈసీజీ,బ్లడ్ షుగర్ వంటి పరీక్షలను నిర్వహించి నెల రోజులకు సరిపడా ఇన్‌హేలర్స్ వంటి మందులను ఉచితంగా అందజేశారు. అనంతరం డాక్టర్ ఎస్.సుబ్బారావు మాట్లాడుతూ శ్వాసకోశ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శ్వాసకోశ వ్యాధులను మొదటి దశలోనే గుర్తించి తగిన చికిత్స తీసుకొని నయం చేసుకోవచ్చని తెలిపారు. వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పొన్‌ముడి, డాక్టర్ కరుణాకరన్, ఎక్స్‌రే టెక్నీషియన్ మురళి, పీఎఫ్‌టీ టెక్నీషియన్ ప్రవీణ్, ల్యాబ్ టెక్నీషియన్ షహనాజ్, అనస్తీషియా టెక్నీషియన్ రంజిత, నర్సింగ్ సిబ్బంది భారతి, స్వర్ణ పాల్గొన్నారు.

రోడ్డు రానీయకుండా అడ్డుకుంటున్నారు


మాట్లాడుతున్న పరాశక్తి వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధి ఎస్.శారద

తిరుపతి కల్చరల్: తమ ప్లాట్లకు రోడ్డు రానీయకుండా అడ్డుకుంటూ అడిగితే దౌర్జన్యానికి పాల్పడుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని తనపల్లి రహదారిలోని శ్రీరామనగర్‌కు చెందిన పరాశక్తి వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు వేడుకున్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో పరాశక్తి వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు ఎస్.శారద, వై.జయచంద్ర, చంద్రారావు, ఎస్.భాస్కర్ మాట్లాడారు. తిరుచానూరు పంచాయతీ, తనపల్లి రోడ్డులోని తిరుపతి రూరల్ మండలంలో ప్రైవేటు వెంచర్‌లో ప్లాట్లు విక్రయించారని తెలిపారు. ఇందులో తాము 600 ప్లాట్లు కొనుగోలు చేశామని తెలిపారు. అయితే గతంలో కురిసిన వర్షాల కారణంగా స్వర్ణముఖి ప్రవాహంతో బ్రిడ్జిలు కొట్టుకుపోవడంతో పాటు శ్రీరామనగర్‌కు వెళ్లే రెండుదారులు కొట్టుకుపోయాయన్నారు. దీంతో తనపల్లి రోడ్డు నుంచి చైతన్య కళాశాల మీదుగా 40 అడుగుల రోడ్డును తమ కాలనీ వాసులకు కల్పిస్తుంటే ఓ వ్యక్తి అడ్డుకుంటూ రోడ్డు రానీయకుండా చేస్తున్నారని తెలిపారు. ఈ స్థలం తనదే అంటూ తమపై దౌర్జన్యానికి పాల్పడుతున్నారని తెలిపారు. రోడ్డును అడ్డుకుంటూ దౌర్జన్యం చేస్తూ అడ్డుకుంటున్న అతనిపై చర్యలు తీసుకొని రోడ్డు కల్పించాలని సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పరాశక్తి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఎన్‌కే.భాస్కర్‌రావు, బాధితులు పాల్గొన్నారు.

శ్మశానంలో మందుబాబుల హల్‌చల్

శ్రీకాళహస్తి: మందుబాబులు రెచ్చిపోతున్నారు. ఎక్కడ పడితే అక్కడ కూర్చొని మద్యం సేవించి బాటిళ్లను పగులగొడుతున్నారు. శ్రీకాళహస్తి మండలం ఈశ్వరయ్యకాలనీ సమీపంలోని శ్మశానవాటికలో కొందరు మందుబాబులు నిత్యం మద్యం సేవించి బాటిళ్లను పగులగొట్టి నానా హంగామా సృష్టిస్తున్నారు. దీంతో శ్మశానం మొత్తం గాజుపెంకులతో నిండిపోయిందని, అంత్యక్రియలు నిర్వహించేందుకు మృతదేహాలను తీసుకువచ్చినప్పుడు గాజు పెంకులు గుచ్చుకుని గాయాలపాలవుతున్నామని స్థానికులు వాపోతున్నారు. శ్మశానంలో మద్యం సేవించవద్దనని పలుమార్లు చెప్పినా పట్టించుకోకుండా గాజు పెంకులు వేస్తున్నారని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి శ్మశానవాటికకు ప్రహరీ గోడ నిర్మించి భద్రత కల్పించాలని కోరుతున్నారు.

ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి – పిచ్చాటూరు రోడ్డులో నడిచే ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై ఆదివారం తిమ్మసముద్రం వద్ద మైసురారెడ్డి, షణ్ముగం దాడి చేశారు. బాధితుడు వినోద్‌కుమార్ కేవీబీపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆర్టీసీ డ్రైవర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ శ్రీకాళహస్తి నుంచి బయలుదేరుతున్న సమయంలో రాజీవ్‌నగర్ వద్ద ఇద్దరు వ్యక్తులు ఫోన్ మాట్లాడుతుతూ ద్విచక్ర వాహనంలో వెళుతున్నారని తెలిపారు. పక్కకు వెళ్లాలని రెండు సార్లు హారన్ కొట్టినట్టు పేర్కొన్నారు. వారు తనను అంతు చూస్తామని బెదిరించారని తెలిపారు. తాను పట్టించుకోకుండా వెళుతుండగా తిమ్మసముద్రం వద్ద బస్సును అడ్డగించి దాడికి పాల్పడినట్లు పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడిని అన్ని యూనియన్ల నాయకులు ఖండించారు. వారు మాట్లాడుతూ ఆర్టీసీ బస్సు డ్రైవర్లు, కండక్టర్లకు రక్షణ లేకుండా పోయిందన్నారు. విధుల్లో ఉన్న వారిపై దాడి చేయడం తగదన్నారు. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

జిమ్నాస్టిక్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ఏర్పేడు: రాష్ట్రస్థాయి జిమ్నాస్టిక్స్ పోటీల్లో ఏర్పేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ప్రధానోపాధ్యాయురాలు సునీత, పీఈటీ శివకుమార్ ఆదివారం తెలిపారు. ఈ నెల 3, 4, 5 తేదీల్లో కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి జిమ్నాస్టిక్స్ పోటీల్లో పాఠశాలకు చెందిన జీవన్‌కుమార్, అభిషేక్, ధనుష్, కాలేష్ బాలుర అక్రోబిక్స్‌లో మ్యాన్ గ్రూప్‌లో ఎంపికై రాష్ట్ర స్థాయి మూడో బహుమతిని సాధించినట్లు వివరించారు. విద్యార్థులను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

స్వర్ణబిందు ప్రాసనకు విశేష స్పందన


ఏకం ఆలయ ప్రాంగణంలో పిల్లలకు స్వర్ణబిందు ప్రాసన చుక్కలు వేస్తున్న సిబ్బంది

వరదయ్యపాళెం: మండలంలోని లోకా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పిల్లల్లో రోగ నిరోధక శక్తి, జ్ఞాపకశక్తి పెంపొందించేందుకు స్వర్ణబిందు ప్రాసన కార్యక్రమం చేపట్టారు. దీనికి విశేష స్పందన లభించింది. ఏకం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో 300 మంది పిల్లలకు స్వర్ణబిందు ప్రాసన చుక్కల మందు పంపిణీ చేశారు. ప్రాచీన భారతీయ కశ్యప ఆయుర్వేద శాస్త్రం ప్రకారం తయారు చేసిన ఈ మందును పిల్లలకు ఉచితంగా అందజేస్తున్నట్లు లోకా ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ లోకేష్ దాసాజీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ జనరల్ మేనేజర్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.